క్లుప్తంగా

ఓటరు జాబితా సవరించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కథలాపూర్: మేడిపెల్లి మండలం కొండాపూర్‌లో ఓటరు జాబితాను సవరణ చేయాలని బీజేపీ నాయకులు బుధవారం తహసీల్దార్ ఎం.డీ బషీరోద్దీన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఒక ఇంట్లోని కుటుంబసభ్యుల పేర్లు ఓటరు జాబితాలో వేర్వేరు వార్డుల్లో నమోదు అయ్యాయన్నారు. వేర్వేరు వార్డుల్లో పేర్లుంటే వార్డు మెంబర్లకు సమస్యలు విన్నవించుకోలేకపోతున్నామని వారు వాపోయారు. కుటుంబసభ్యులందరీ పేర్లు ఒక్క వార్డులోనే ఉండేలా ఓటరు జాబితాను సవరించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మేకల రాజు, బీజేపీ నాయకులు అడ్డగట్ల గణేశ్, దుండిగాల భరత్, నీలం గంగాధర్, ముస్కెం రఘు, రామచందర్, రమేశ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి


దొంతాపూర్‌లో ప్రచారం చేస్తున్న టీచర్లు

ధర్మపురి: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా మండలంలోని దొంతాపూర్, జైనా, దోనూర్, నక్కలపేట తదితర గ్రామాల్లో బుధవారం హెచ్ఎం ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య నందిస్తున్నామని మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని వాడ వాడలా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంచందర్‌రావు, ఎంపీటీసీ రాంటెంకి చందన, ఉపసర్పంచ్ మల్లయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని ప్రచారం


ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

మల్లాపూర్: విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేర్పించాలని మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం ఏ.ఖలిక్ కోరారు. బుధవారం మల్లాపూర్‌లో ప్రభుత్వ కళాశాల అధ్యాపకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. 2022–23 విద్యాసంవత్సరంలోనే ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా జిల్లాలోనే ఉత్తమ ఫలితాలను సాధించిన ఏకైక కళాశాలగా నిలిచిందన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు విశాలమైన తరగతిగదులు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో ప్రభుత్వ బోధన తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎ.శ్రీనివాస్, రాజేశం, నరేశ్, మహేశ్, రాజేందర్, పీ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రం ఏర్పాటు చేసిన సభ్యులు

సాక్షి స్పందన

రాయికల్: పట్టణంలోని పాతబస్టాండ్‌లో మా ఊరు ముచ్చట్లు ఆధ్వర్యంలో ప్రయాణికుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం సాక్షిలో ప్రచురితమైన 'పాత బస్టాండ్‌లో తాగునీటికి ఇబ్బందులు' అనే ఫొటోస్టోరీకి స్పందించిన మా ఊరు ముచ్చట్లు వాట్సాప్ గ్రూప్ సభ్యులు చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రయాణికులకు తాగునీటి సమస్యను తీర్చారు. ఈ సందర్భంగా సాక్షి దినపత్రికకు ప్రయాణికులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

- వానాకాలంలో తరచూ విద్యుత్ ప్రమాదాలు
- పశువుల పాలిట యమపాశాలవుతున్న కరెంట్ తీగలు
- జాగ్రత్తలు పాటిస్తే మేలు


విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాలిబూడిదైన ఇల్లు(ఫైల్)


విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన గేదెలు(ఫైల్)

బుగ్గారం: వానాకాలంలో విద్యుత్ ప్రమాదాలు సర్వసాధారణమవుతున్నాయి. గాలివాన ధాటికి విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, వైర్లు కిందపడిపోవడంతో అధిక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా పశువులు అధిక సంఖ్యలో విద్యుదాఘాతానికి గురవుతూ పాడి రైతులకు తీవ్ర నష్టం కలుగుతోంది.అంతేకాకుండా ఇళ్లల్లో, వ్యవసాయ క్షేత్రాలలో అజాగ్రత్తతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలపై కొంత అవగాహన ఏర్పరచుకుని జాగ్రత్తలు పాటిస్తే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని విద్యుత్ అధికారులు,నిపుణులు సూచిస్తున్నారు.

ఇళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

చాలమంది ఇండ్లలో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసుకున్న విద్యుత్ వైరింగ్ సిస్టంను తరచుగా పరిశీలించకపోవడంతో ఎలుకలు,పందికొక్కులు వాటిని కొరికివేయడంతో లోపలి వైర్లు బయటపడుతుంటాయి. వర్షాలు కురిసినప్పుడు తేమ చేరి ఎర్తింగ్ వస్తుంటుంది. ముఖ్యంగా పాతకాలపు ఇండ్లలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. చాలామంది బట్టలు ఆరేసుకోవడానికి విద్యుత్ వైర్ల సమీపంలోనే ఇనుప తీగలను ఏర్పాటు చేసుకుంటారు.ఇటువంటి చోట్ల కూడా విద్యుత్ ప్రమాదాలు జరిగి అనేక మంది చనిపోయిన సంఘటనలున్నాయి. ఇళ్లల్లో ఏ చిన్న విద్యుత్ సమస్య తలెత్తినా విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. నిపుణులైన వారితోనే విద్యుత్ మరమ్మతులు చేయించాలి.

వ్యవసాయ క్షేత్రాల్లో ..

వానాకాలం ప్రారంభం కాగానే వ్యవసాయ పనులు ప్రారంభించడానికి రైతులు పొలాలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో పొలాల్లో ఉన్న మోటారు పంపుల వద్ద వైర్లను సరిగ్గా పరిశీలించకపోవడంతో తెగిపడి ఉన్న వాటి వలన విద్యుత్ ప్రమాదాలు జరుగుతుంటాయి. అలాగే అనేక చోట్ల రైతులే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సరఫరా నిలిపివేసి సొంతంగా రిపేరు చేసుకుంటుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గాలివాన వచ్చినప్పుడు ఇళ్లకు దూరంగా ఉన్న వ్యవసాయ ప్రాంతాలో ఎవరూ దృష్టిసారించకపోవడం వలన వైర్లు తెగిపడి పశువులు కరెంట్ కాటుకు బలవుతున్నాయి.అలాగే కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లకు తగిలి పశువులు మృత్యువాత పడుతున్నాయి. గతంలో రాయికల్ మండలంలో ఒకేసారి 15 గేదెలు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడడం విద్యుత్ ప్రమాదాల తీవ్రతకు అద్దం పడుతోంది. బుగ్గారం మండలంలోని చందయ్యపల్లె లో గతంలో ఓసారి విద్యుత్ షాక్‌కు గురైన గేదెలు 4 రోజుల తర్వాత గానీ గుర్తించలేదు. మండలంలోని సిరికొండలో వారం క్రితం గాలివానకు విద్యుత్ తీగలు తెగిపడి ఒకేసారి ఆరు పాడి పశువులు మృత్యువాత పడ్డాయి.ఇవే కాకుండా జిల్లావ్యాప్తంగా ప్రతీ ఏడాది విద్యుత్ ప్రమాదాల బారిన పడుతూ పెద్ద సంఖ్యలో పశువులు చనిపోతున్నాయి. అనేకమంది మనుషులు సైతం మృత్యువాత పడుతున్నారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి తగిన రక్షణ చర్యలు చేపట్టాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



రైతులు తమ పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలను పరిశీలించకుండా వాటి సమీపంలోకి వెళ్లరాదు. ఉరుముల వలన సపోర్టు వైరుకున్న రక్షక పరికరాలు పగిలిపోయి వాటికి విద్యుత్ ప్రసారం అవుతుంది.అలాగే రైతులు తమ మోటార్లను ఎత్తు ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవడమే కాకుండా వాటి చుట్టూ రక్షణ ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్ స్తంభాలు ఉన్న చోట్లలో పశువులను తిప్పరాదు.

– జి.సత్యనారాయణ.ఎస్ఈ, జగిత్యాల జిల్లా

రక్షణ చర్యలు చేపట్టాలి



విద్యుత్ ప్రమాదాలు నివారించడానికి విద్యుత్‌శాఖ అధికారులు ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.అంతేకాకుండా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను,తీగలను,ట్రాన్స్‌ఫార్మర్లను వానాకాలానికి ముందే గుర్తించి తగిన రక్షణ చర్యలను తీసుకోవాలి.రైతులు సైతం విద్యుత్ శాఖ అధికారుల సలహాలను,సూచనలను పాటించాలి.

– దసర్తి పూర్ణచందర్,బుగ్గారం

నీటిరంగంలో దేశానికే తెలంగాణ ఆదర్శం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: నీటిరంగంలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. బుధవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పొన్నాల గార్డెన్స్‌లో నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాలపై 9 ఏళ్లలో అత్యధికంగా ఖర్చు చేశారని చెప్పారు. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ, వాగుల పునరుజ్జీవతంతో సత్ఫలితాలు, పెరిగిన భూగర్భజలాలతో పాడిపంటలతో కళకళలాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఆర్డీవో మాధురి పాల్గొన్నారు.

పెన్షనర్లకు ప్రభుత్వం భరోసా

సీనియర్ సిటిజన్లకు, పెన్షనర్లకు ప్రభుత్వం భరోసాగా ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ కలిసి పెన్షనర్ల భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేవారు. స్పందించిన ఎమ్మెల్యే నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, విశ్వనాథం, హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతోనే ఆపరేషన్లు

సేవా దృక్పథంతోనే ఆపరేషన్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని 14 మంది నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేస్తున్నామని, నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర సాధనలో జయశంకర్ సార్‌ది కీలకపాత్ర


నివాళి అర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ నాయకులు

మల్లాపూర్: నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్ష అయిన తెలంగాణ ఏర్పాటులో ప్రొ.జయశంకర్ సార్ పాత్ర కీలకమైనదని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మానాల కిష్టయ్య అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలో జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు శ్రీపాద వెంకటాద్రి, ఎగ్యారపు శ్రీనివాస్, మదనపల్లి శివకుమార్, శ్రీనివాస్, పోలాస రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కథలాపూర్: గ్రామాలను సంపూర్ణ అభివృద్ధి చేయడమే లక్ష్యమని బీఆర్ఎస్ నాయకుడు గోలి మోహన్ అన్నారు. బుధవారం కథలాపూర్ మండలం బొమ్మెనలో పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని యువతకు, మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో వేములవాడ ఎమ్మెల్యేగా బరిలో ఉంటానని, మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు.

'కాళేశ్వరం'తో రాష్ట్రానికి ప్రపంచ స్థాయి గుర్తింపు

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: నీటి పారుదల రంగంలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలుస్తోందని, కాళేశ్వరంప్రాజెక్టుకు ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో నిర్వహించిన సాగునీటి దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రం వచ్చిన తర్వాత సాగు, తాగు నీటి సమస్యను తీర్చేందుకు కాళేశ్వరం వంటి మహా ప్రాజెక్టు నిర్మించారని, దీనికి ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చిందన్నారు. కాళేశ్వరంతో లక్షలాది ఎకరాల్లో పంటలు సాగులోకి వచ్చాయన్నారు. సాగు నీటి లభ్యత పెరగటంతో వ్యవసాయ రంగం అభివృద్ధి చెంది వరి సాగులో దేశంలోనే మొదటి స్థానంలో తెలంగాణ నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావు, మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, ఎంపీపీలు తోట నారాయణ, మారు సాయిరెడ్డి, జాజాల భీమేశ్వరి, కాటిపెల్లి జరోజన, జెడ్పీటీసీలు దారిశెట్టి లావణ్య, కంటం భారతి, సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో చేర్మెన్లు, నీటిపారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డలు క్షేమం


తక్కళ్లపల్లిలో చిన్నారులకు అన్నప్రాసన

జగిత్యాలరూరల్: పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారని జగిత్యాల రూరల్ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా తల్లీబిడ్డలకు అందించే సేవలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లె సత్తమ్మ, ఉపసర్పంచ్ రాం మోహన్, కార్యదర్శి రాజిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పద్మరాణి, జమున, శైలజ, ఆశా కార్యకర్తలు సత్యవాణి, హేమలత, రేవతి పాల్గొన్నారు.

రాయికల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని కౌన్సిలర్ మ్యాకల అనురాధ అన్నారు. రాయికల్ పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతం చేసి చిన్నారులకు అన్నప్రసాన చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, సర్పంచ్ చింతలపల్లి స్వప్న, ఎంపీటీసీ దొంతి నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్, కిషన్‌రావుపల్లె, తిమ్మయపల్లె, ఎఖీన్‌పూర్, అయిలాపూర్ గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైనిమెత్యూ, అంగన్‌వాడి కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, సంపూర్ణ పోషకాహారం అందించడంతోపాటు, ఆట పాటలతో కూడి విద్యాబోధనతో పిల్లలు మానసిక పరిశ్వత చెందుతారని ఐసీడీఎస్ సీడీపీవో నర్సింగరాణి అన్నారు. మల్యాల, తక్కళ్లపల్లిలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల బడిబాట, అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో రజిత,కళావతి, సంతోషిణి, మమత, శిరీష, స్వప్న, రాణి, పాల్గొన్నారు.

మల్లాపూర్: మహిళల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సరికెల లక్ష్మి అన్నారు. మండలంలోని కుస్తాపూర్‌లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, మహిపాల్, అంగన్‌వాడీ టీచర్లు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని దమ్మన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు సీమంతం చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మమత, అంగన్‌వాడీ టీచర్ సైండ్ల రజిత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రేషన్ కార్డుల నుంచి గల్ఫ్ కార్మికుల పేర్లు తొలగించొద్దు

గొల్లపల్లి: బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికుల పేర్లు రేషన్ కార్డుల నుంచి తొలగించొద్దని గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గల్ఫ్ కార్మిక కుటుంబాలతో గల్ఫ్ జేఏసీ బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ గల్ఫ్‌కు వెళ్లిన సన్నకారు, చిన్నకారు రైతులకు రైతుబంధు, రైతు బీమా పథకం వర్తించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గల్ఫ్ కార్మికులకు జీవిత బీమా, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్ లతో కూడిన సమగ్రమైన సాంఘిక భద్రత పథకం ప్రవేశ పెట్టాలన్నారు. ఆరోగ్యశ్రీ, గృహ నిర్మాణం వంటి పథకాలను వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయిండ్ల రాజిరెడ్డి, దమ్మన్నపేట సర్పంచ్ మిల్కూరి అనసూయ, చంద్రయ్య, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మల్లాపూర్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని పాతదాంరాజుపల్లిలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో నిరాధరణకు గురైన ఆలయాలకు సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, సర్పంచ్ మైదాసు శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ సుతారి రాజేందర్, నాయకులు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో యువతకు మానసికోల్లాసం

మల్లాపూర్: క్రీడలతో యువతకు మానసికోల్లాసం కలిగిస్తాయని తహసీల్దార్ రవీందర్, ఎస్సై నవీన్‌కుమార్ అన్నారు.మండలంలోని రేగుంటలో నిర్వహిస్తున్న విలేజ్ టూ విలేజ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు బుధవారం హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుందేల్ల నర్సయ్య, ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ మల్లారెడ్డి, రేగుంట ఆల్‌యూత్ అసోసియేషన్ స్పోర్ట్ క్లబ్ అధ్యక్షుడు గనవేని మల్లేష్‌యాదవ్, యువకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

గొల్లపల్లి: మండల ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా కాసం రాజశేఖర్, పట్టణ అధ్యక్షుడిగా బొల్లం రమేశ్ ఇటీవల ఎన్నిక కాగా, ఈ మేరకు బుధవారం సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛ అందజేశారు.

కుల, చేతి వృత్తుల వారు ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో బీసీ కుల, చేతి వృత్తుల వారు ప్రభుత్వం అందించే రూ. 1 లక్ష ఆర్థికసాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి తెలిపారు. బుధవారం మాట్లాడుతూ 18 నుంచి 55 ఏళ్ల లోపు ఉన్నవారు ఈ నెల 20 లోపు మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

చెరువుల పండగను బహిష్కరించాలి


లక్ష్మీపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న గంగపుత్రులు

జగిత్యాలరూరల్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈనెల 8న నిర్వహించే ఊరూర చెరువుల పండుగను బహిష్కరించాలని లక్ష్మీపూర్ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దేవరాజ్ అన్నారు. బుధవారం లక్ష్మీపూర్ మత్స్య సహకార సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య సహకార సంఘం 1964 నుంచి ఇప్పటి వరకు మత్స్య సహకార సంఘం అధ్యక్షులుగా గంగపుత్రులే కొనసాగుతున్నారని, ప్రభుత్వం మొట్టమొదటిసారిగా ముదిరాజ్ కులస్తులకు చైర్మన్ కట్టబెట్టి గంగపుత్రులకు ద్రోహం చేసినందుకు సంబరాలను బహిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు గజ్జి రాజేశ్, మైలారపు వినయ్, గజ్జి మల్లేశ్, మత్స్య సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వాల్గొండలో నిరసన

మల్లాపూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న చెరువుల పండుగను బహిష్కరిస్తామని వాల్గొండ గంగపుత్ర సంఘం సభ్యులు అన్నారు. మండలంలోని వాల్గొండలో బుధవారం గంగపుత్ర సంఘం నాయకుల సమావేశంలో మాట్లాడారు. చెరువులు, కుంటలపై గంగపుత్రులే మొదటి హక్కుదారులని అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందేనన్నారు. గంగపుత్రుల జీవనాధారమైన చేపలవేట వృతిపై ఇతర కులస్తులు దాడి చేస్తున్న వారికే ప్రభుత్వం వంతపాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్యకారుల సహకార సమాఖ్య చైర్మన్ పదవిని ఇప్పటి వరకు గంగపుత్రులకే కేటాయించగా, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ చైర్మన్ పదవిని ముదిరాజ్‌లకు కట్టబెట్టడాన్ని తప్పుబట్టారు.దీనికి నిరసనగా చెరువుల పండుగను బహిష్కరించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం గంగపుత్రుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చెరువుల పండుగకు ఏర్పాట్లు పూర్తి

పెగడపల్లి: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించనున్న చెరువుల పండుగకు అధికారులు, సర్పంచులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు మండలంలోని చెరువుల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్, గ్రామాల ఇన్‌చార్జి అధికారులు బుధవారం పరిశీలించారు. చెరువుల వద్ద పరిసరాలను శుభ్రం చేయించడంతో పాటు విద్యుద్దీపాలంకరణ, కట్టమైసమ్మకు బోనాలు, బతుకమ్మ పండుగ, తెప్పోత్సవాలు, సామూహిక భోజనాలు ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గంగమ్మతల్లికి బోనాలు



రాయికల్: మండలంలోని రామాజీపేటలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం గంగమ్మతల్లికి బోనాలు చేశారు. మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్న నర్సయ్య, స్వామి, రాజీవ్, ప్రశాంత్, శేఖర్, మహిళలు పాల్గొన్నారు.

బుగ్గ భీమన్న శోభాయాత్ర

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం చెర్లపల్లి గ్రామ శివారుల్లోని రోల్లవాగు పరిసరాల్లో నూతనంగా నిర్మించిన బుగ్గభీమన్న ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా బుధవారం బుగ్గభీమన్న స్వామి వారిని మంగళవాయిద్యాల నడుమ శోభాయాత్రను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో మధుకుమారాచార్యులు, సర్పంచ్ అజ్మీరా ప్రభాకర్ పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

కథలాపూర్: భీమారం మండలం కమ్మరిపేటలో బుధవారం బీరప్ప ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బీరప్ప ఆలయంలో ఒగ్గు పూజారులు పట్నం ముగ్గువేయగా, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి 20ఎకరాలు కేటాయించాలి


వినతిపత్రం అందిస్తున్న సంఘు నాయకులు

మెట్‌పల్లి: నియోజకవర్గంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి 20 ఎకరాలు కేటాయించాలని కోరుతూ గంగపుత్ర సంఘం నాయకులు బుధవారం ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రతి ఏటా చెరువులో పెంపకానికి ఆంధ్రా ప్రాంతం నుంచి తీసుకవస్తున్న చేప పిల్లల్లో ఎక్కువ శాతం చెరువులోకి వదలగానే మృత్యువాత పడుతున్నాయన్నారు. దీనివల్ల మత్స్యకారుల ఉపాధి దెబ్బతింటుందని, ప్రభుత్వం దీనిని దృష్టిలో పెట్టుకొని ఇక్కడే చేప పిల్లల కోసం 20 ఎకరాల్లో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు కంతి హరికుమార్, పల్లికొండ ప్రవీణ్, భూమేశ్వర్, రమేశ్, నర్సయ్య, పుప్పాల శంకర్ తదితరులున్నారు.

మేదరి కులస్తులను ఆదుకోవాలి


ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న నాయకులు

మల్యాల: రాష్ట్రంలో అత్యంత వెనకబడిన మేదరి కులస్తులకు కుల వృత్తిని కాపాడుకునేందుకు మేదరి కులస్తుందరికీ రూ.1లక్ష ఆర్థికసాయం అందించాలని మేదరి సంఘం నాయకులు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో మేదరి కుల సంఘ భవనాల నిర్మాణానికి రెండు గుంటల భూమి, నిధులు కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రవిశంకర్ కుల సంఘ భవనాల నిర్మాణానికి రూ.5లక్షలు చొప్పున మంజూరు చేస్తామని, మండల కేంద్రాల్లో స్థలాన్ని కేటాయిస్తామని భరోసా ఇచ్చారని మల్యాల మండల మేదరి కుల సంఘం అధ్యక్షుడు పోతు వెంకటయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నాయకులు సన్మానించారు.